# సంఘం శరణం గచ్ఛామి

మంత్రి గారి అసలు పేరు కరుణాకరరావు అనుకోండి... కాని మూడేళ్ళ కింద కరుణాకరరావుగారు సాంఘిక సంక్షేమము మరియు అటవీ శాఖకు మంత్రిగా అయ్యాక అందరూ ఆయన పేరు మరిచిపోయి, మంత్రిగారు మంత్రిగారు - అని వ్యవహరించడం సామాన్యమైపోయింది.

ఆయన మంత్రయ్యాక మొట్టమొదటి పత్రికాగోష్టిలో - సాంఘిక సంక్షేమానికీ అడవులకూ గల బంధుత్వం ఏమిటి ? అని ఎవడో ఆకతాయి పత్రికా రచయిత అడిగితే, మంత్రిగారేం సామాన్యులా... మనిషి మొదట అడవులలోనే పుట్టాడు, అక్కడే తిరిగాడు, అక్కడే మొట్టమొదటి మానవ సంఘం ఏర్పడింది... ఆ తర్వాతే గదండీ ఈ నాగరికతా గట్రా రావడం - అని బ్రిలియంట్‌గా సమాధానం చెప్పి తప్పించేసుకున్నారు. మరి ఆయనకు సుమతి శతకంలోని ఆపద్యం వుంది చూశారూ, ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటికామాట అన్నది - అదంటే చిన్నప్పటి నుండి భలే ఇష్టం. ఆ పద్యమే గనుక లేకపోతే ఈ నాడాయన ఇంత వారయ్యే వారా ? (కారు అని భావము: ఏమొగల్రాజ పురం హోటల్‌లోనో ఎంగిలి కప్పులు కడుగుతూండేవారు అని కూడా భావము.)

కరుణాకరరావు మంత్రి అయ్యాక ఒకనాడు-

ఎన్నికల్లో మెజారిటీ లభించిన పార్టీ నాయకుడి మొహంలా సూర్యుడు వెల్గిపోతు న్నాడు. ఆ ఉదయం మంత్రిగారు మల్లెపువ్వులాంటి ఖద్దరు బట్టలు తొడుక్కుని, గంజి వేసి ఇస్త్రీ పెట్టిన చిరునవ్వును ముఖాని కలంకరించుకుని, విసవిసా నడిచి, గుమ్మం ఎదుట నిల్చున్న నల్లటి, పొడుగాటి, త్రాచుపాములాటి కారులో ఎక్కి కూర్చున్నారు. ఆ రోజు ఆయనకు భలే అర్జెంటు పనులు చాలా వున్నాయి, అందుకనే ఆ హడావిడి.

రాజహంసలా బయలుదేరింది కారు, గేటు దాటింది, డ్రైవర్ ఝామ్మున వేగం పుంజుకో యత్నించాడు. గమ్మున ఆగిపోయింది కారు, డ్రైవర్ ఆశ్చర్యపడ్డాడు, ఏదో

నొక్కాడు, ఏదో తిప్పాడు, ఇంకేదో లాగాడు, కాని నల్లకారు ససేమిరా కదలనంది. కారు కంపెనీలవాడి తల్లి మీద కొన్ని విశేషణాలు ప్రయోగించారు మంత్రిగారు.

రెండు నిముషాల తర్వాత డ్రైవర్, పది గజాల వెనక వున్న మంత్రిగారింటికి వెళ్ళి తోటమాలినీ గేటు కీపరునూ పిలిచాడు. వాళ్ళిద్దరూ వచ్చి కారుని తోశారు, కాని అది కదలలేదు.

మోహరమున తానెక్కిన గుర్రము పారక పోయినప్పటికీ గ్రక్కున విడువంగ తలవని మంత్రిగారు ఆదేశించారు– "కొండయ్యని పిలు"

వచ్చాడు కొండయ్య,

కొండయ్య, తోటమాలి, గేటుకీపర్ కలిసి తోయగా, అసమ్మతి సూచకంగా రెండు దగ్గులు దగ్గి, నాల్గు తుమ్ములు తుమ్మి కర్ మంటూ వెళ్ళిపోయింది కారు– స్వదేశీ మంత్రిగారెక్కిన విదేశీ కారు, ఎనభైవేల రూపాయలకు ఎస్.టి.సి. వారమ్మిన కారు.

ఆ కారుని తోయడం ముగించిన కొండయ్య మళ్ళీ బంగళాలోకి వెళ్ళాడు. బట్టలన్నీ వుతికి అరవేశాడు. అరబస్తాడు బియ్యాన్ని దంచాడు, అమ్మగారు... అంటే మంత్రిగారి భార్యగారయిన హేమలతమ్మగారు– చెప్పినట్లుగా ఇంటిలోని ఫర్నిచర్‌నంతా ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు మార్చాడు, కారు షెడ్‌ని శుభ్రంగా తుడిచి కడిగాడు.. అన్ని పనులూ అయ్యాక బంగళా చుట్టూ వున్న అరెకరా తోటలో వున్న తన గదిలోకి వెళ్ళి కూచుని, పొయ్యి అంటించి, జొన్నపిండి రొట్టెలను తయారుచేయసాగాడు.

సరిగ్గా అదేసమయానికి–

ఆ నగరానికి నలభై మైళ్ళవతల నాగవరం గ్రామంలో ఒక గుడిసె లోపల, చింపిగోతాం మీద పడుకున్న నాలుగేళ్ళ పిల్లవాడి ఒళ్ళు వేడిమిని వాళ్ళమ్మకూడా భరించలేక భరిస్తూ పక్కనే కూచుని వాడివీపుని నిమురుతూంది. పొద్దున్న శొంఠి మిరియాల కషాయం ఇచ్చినాక కాస్త తగ్గినట్లే వుంది, కాని వెంకమ్మ హృదయాన్ని భయం పురుగులా తొలుస్తూనే వుంది.

వాడొస్తేబాగుండును... వాడొస్తేబాగుండును, అన్నది ఆమె జపం అయింది. చేతవున్న ఆఖరి అయిదుపైసలూ మొన్న సాయంత్రం కిష్టిగాడే తీసుకెళ్ళి బిళ్ళలు తెచ్చుకున్నాడు. ఆ మాయదారి బిళ్ళలవల్లే వచ్చిందేమో ఈ పాడు జ్వరం. నా బిడ్డను కాపాడు తండ్రీ... కాపాడి వాడిని పెద్దవాడిని చెయ్యి...కావాలంటే నన్నెత్తుకుపో తండ్రీ నన్నెత్తుకుపో...

– అని ఒంటరిగా మౌనంగా విలపిస్తూ తపిస్తూ కూచుంది వెంకమ్మ, ఆ పూట కరణంగారింట పాచిపనికి పోలేకుండా కూచుంది తల్లి వెంకమ్మ– కొండయ్య పెళ్ళాం వెంకమ్మ.

వెంకమ్మ తన కొడుకుతో బాటు వెళ్ళి పోయిగా మొగుడితో బాటు నగరంలో వుండేదే. అక్కడి ఇంత ఇంత మడుసులను చూసేదే – బయస్కోపుల కెళ్ళేదే – ఇట్లా కష్టం వచ్చినపుడు కొండయ్యతో పంచుకొనేదే – కానీ

మంత్రిగారి భార్యగారయిన హేమలతమ్మగారు తమ భర్తగారయిన మంత్రిగారితో – "ఈ మగనౌకర్లున్నారే, వీళ్ళని ఒంటరిగా వుంచితేనే బాగా ఒళ్ళు వంచి పనిచేస్తారు, పెళ్ళాల్తో బాటుంటే ఈ వెధవల టైమంతా పెళ్లాంచుట్టూ తిరగడానికే సరి పోతుంది." అన్నది – హేమలతమ్మ – థియెరీ ఆఫ్ మేల్ సర్వెంట్స్, గురించి వివరించి, కొండయ్య పెళ్ళాం వాళ్ళ వూళ్ళోనే వుండేటట్లున్నూ వాడుమాత్రం ఇక్కడే బంగళా వెనకాతల, ఎప్పుడు పిలిస్తే అపుడు అందుబాటుగా వుండేట ట్లున్నూ ఏర్పాటు చేసింది. ఆ విధంగా ఆవూ దూడా వూళ్ళోవుండగా కొండయ్య ఎద్దు మంత్రిగారింట – అమ్మగారెదురు చూచినట్లే రాత్రింబగళ్ళు పనిచేసేవాడు. మధ్యాహ్నం ఓ గంట విరామం, రాత్రి ఓ అయిదారు గంటల నిద్రా మినహాయిస్తే మిగతా గంటలన్నీ ప్రజాసేవకుడయిన మంత్రిగారింట్లో నానా సేవలు చేసి నెలకు పాతిక రూపాయలు తీసుకునేవాడు కొండయ్య. ఏ రెండు వారాలకోసారో వూరికి వెళ్ళేవాడు. పెళ్ళాంబిడ్డలతో ఒక్క రోజుండి వచ్చేవాడు కొండయ్య. ఇట్లా గడిచాయి యీ మూడేళ్ళు.

"వాడు పని ఒదిలేస్తే బాగుణ్ను– ముగ్గురమూ ఒక్కచోటే వుంటే బాగుణ్ను– అంబలి తాగినా బాగుణ్ను... ఛీ ఛీ.. వెధవ కడుపు కోసం ఏంపాట్లు... ఏం జనమ ఏం జనమ –" విసుక్కుంది వెంకమ్మ ; నొచ్చుకుంది వెంకమ్మ ; తిట్టుకుంది వెంకమ్మ.

అర్థంలేకుండా మూలిగి, అటొత్తిగిలి పడుకున్నాడు కిష్టిగాడు, మూగేడుపు ఏడ్చింది వెంకమ్మ.

పక్కగుడిసెలో వుండే ఎల్లమ్మ వచ్చింది. ఏమొదినా అన్న ఎపుడు వస్తాడే అని అడిగింది.

"ఏమోనే, మూడువారాలు దాటింది వాడొచ్చి... దొరగారితోబాటు ఎక్కడికయినా బయటి ఊళ్ళకెళ్ళినాడేమో... వీడికేమో జ్వరం పెట్లిపోతాంది... దేవుడే కాపాడాల..."

"రేప్పొద్దున్నే మా బావెళ్తున్నాడు పట్నానికి... అన్నయ్యతో చెప్పిరమ్మంటా నొదినా" అంది ఎల్లమ్మ; వెంకమ్మ కళ్ళలోంచి కృతజ్ఞత కురిసింది కుండపోతగా....

అక్కడ–

పట్నంలో –

మంత్రిగారింట్లో–

ఆనాడు మధ్యాహ్నం కొండయ్యకు పెళ్ళాం పిల్లల్ని గురించి అనుకోవడానికి కూడా తీరికలేనంత పని... ..

అమ్మగారి –అదే , హేమలతమ్మగారి మండలిది– అఖిలభారత ఆదర్శ మహిళా మండలి – ఇవాళే మంత్రిగారింట్లో సమావేశం – హేమలతమ్మగారే ఆ మండలి అధ్యక్షురాలు.

ఆ మండలిలో సభ్యురాండ్రంతా దేశంలో క్షామాలు, వరదలూ, అగ్నిప్రమాదాలు ఎపుడెపుడొస్తాయా అని కాచుక్కూచుంటారు. అటువంటి దేదయినా రాగానే వారంతా హుటాహుటీని కార్లమీదో విమానాలమీదో వెళ్ళిపోయి, పత్రికా విలేఖరులూ

వాళ్ళొ రాగానే - వస్త్రాలు దానం చెయ్యడం - పిల్లలకు పాలుపట్టడం వంటివి చేసేస్తుంటారు. ఇట్లాటి దుర్ఘటనల మధ్య కాలంలో వారానికీ, రెండు వారాలకీ ఓ సినిమా ఆడించి టిక్కట్లు అమ్మి నిధుల సేకరణ చేస్తుంటారు.

కాని ఇంతకన్న శాశ్వతమైన ప్రాతిపదిక మీద ఏదయినా సాధించాలన్న హేమల తమ్మగారి సంకల్పమే ఆనాటి మండలి. సమావేశానికి కారణం.

దాదాపు డెబ్బైకార్లల్లో వచ్చిన నూటపది మందికి కలిపి భారీ ఎత్తున పార్టీ జరిగింది. వంట వాడికి సాయంగా కొండయ్య పై పనులన్నీ చేస్తున్నాడు.

పార్టీ అయ్యాక సభ్యురాండ్రందరూ కలిసి పదిహేను నిముషాలు తీవ్రంగా చర్చించి ఒక అనాథ శరణాలయం స్థాపించాలన్న నిర్ణయానికి ఏకగ్రీవంగా వచ్చేశారు. సదరు శరణాలయం నిమిత్తం ప్రభుత్వంవారి సాంఘిక సంక్షేమ శాఖ నుండి లక్ష రూపాయలు గ్రాంటు సంపాదించే బృహత్కార్యాన్ని - అధ్యక్షురాలికి వదిలి పెట్టారు. ఎటూ వచ్చేది మండు వేసవి గనుక తమ మండలి తరవాత సమావేశం సిమ్లాలోనా, ఊటీలోనా అన్న ప్రశ్న మీద చాలా తీవ్రమైన వాగ్వివాదాలు గంటన్నర సాగాక, ఆ విషయాన్ని కూలంకషంగా చర్చించడానికి ఒక త్రిసభ్య సంఘాన్ని నియమించి మండలి సభ్యురాండ్రందరూ క్లబ్ లకు తదితర ఎంగేజ్ మెంట్లకూ వెళ్ళిపోయారు.

అపుడు రాత్రి ఎనిమిది అయింది.

మంత్రివారు అయిదారూళ్ళు తిరిగి, తిరిగి, అవతలవర్గం వారి ప్రాబల్యం చెల్లాచెదరయ్యేటట్లు మీటింగుల్లో మాట్లాడి మాట్లాడి అలసి,సొలసి, విసిగి వేసారి ఇంటికి వచ్చారు. అయినాసరే, మరునాడుదయం బుద్ధజయంతి సందర్భంగా తామివ్వ వలసిన మహత్తరమైన ప్రసంగాన్నొక దాన్ని తయారుచేయాలని పెద్ద హాలులో కూర్చున్నారు. మంత్రిగారు. శ్రీవారు మామూలుగా తమ మేధస్సు నింతలా కష్టపెట్టకపోదురుగాని ఆ పి.ఏ. పీనుగు ఇప్పుడే లీవులో చచ్చాడు. లేకపోతే ఇట్లాంటి ఇబ్బందికరమైన స్పీచీలు గట్రా ఎక్కడనుంచో మొదటకాపీ, తర్వాత టైపూ కొట్టిపెట్టును.

సమావేశం ముగించి సభ్యురాండ్రను పంపేసిన హేమలతమ్మగారు, భర్తను గమనించి వంటింట్లోకి కబురు పెట్టారు- వేడిగా కాస్త పాలల్లో ఏదయినా కలిపి తెమ్మని....

అట్లాచెప్పిన తర్వాత స్నానం ముగించి, వేరే చీర కట్టుకుని మెట్లుదిగి, పెద్ద హాల్లోకి హేమలతమ్మగారు వస్తుండగా-

ట్రేలో పెద్దపింగాణీ కూజాలో, హార్లిక్సు కలిపిన వేడిపాలు, రెండు కప్పులు, సాసర్లు పెట్టుకొని వంటింటి వైపునుండి వరండా దాటి పెద్ద హాల్లోకి కొండయ్య అడుగు పెడుతుండగా --

మంత్రిగారి ముద్దుల కొడుకు ఎనిమిదేళ్ళ మధుసూదనం వున్నట్లుండి,తమాషాకని వరండాతలుపు చాటునుండి "గుర్" మని పులిలా అరిచి కొండయ్య వెనక్కూ దూకాడు.

అంతే ;

ఖంగ్ ఖంగ్ ఖళింగ్‌మని జలతరంగం కచ్చేరీలా పింగాణీ వర్షం కురిసింది.

వేడి వేడి పాలు మీదకు చిందిన మధుసూదనం కుయ్యో్యా మన్నాడు.

దిగుతున్న హేమలతమ్మ, ఒక్క వుదుటున వెళ్ళి కొడుకుని కావలించుకుని – "ఒరేయ్ నాయనా, ఏమయింది. ఏమయిందిరో... ఓరి కొండయ్య పీనుగా : ఏం చేశావురా నా తండ్రిని : ఒళ్ళు తెలియలేదుట్రా :" అంటూ కలగాపులగంగా అరున్నర శ్రుతిలో అరవసాగింది – మామూలుగా ఒకటిన్నర కన్న ఎక్కువ శ్రుతిలో మాట్లాడేవారి అనాగరికతను ఏవగించుకునే హేమలతమ్మగారు.

కరుణామయుడైన బుద్ధుడి గురించి మూడు గొప్ప పేరాలు ముగించి నాల్గవదానిని ఎత్తుకో బోతున్న మంత్రిగారు దానినలా వదిలేసి, ఎగిరి పడ్డారు.

తాను ఎంతో కష్టపడి, ఎన్నో సంపాదకీయాలకు ప్రతిపక్ష సభ్యుల విసుర్లకు గురిఅయినప్పటికీ లెక్కచేయక, ఆ డెలిగేషనులో సభ్యుడిగా ఎన్నికయి, లండన్ కు వెళ్ళి వస్తూ వస్తూ ఫ్రాంక్‌ఫర్ట్‌లో కొన్న ఈ అపూర్వమయిన 19 వ శతాబ్ది పింగాణీ టీ సెట్టులో సగం ఇట్లా నేలనుకూలి ముక్కలవడం చూచి మతిపోయినవాడై, మంత్రిగారు – "ఒరేయ్ మృగమా, ఏం చేశావురా? ఏం చేశావో తెలుసట్రా? అదేవిటో తెలుసట్రా ? దాని విలువేమిటో తెలుసట్రా ? దాని చరిత్రేమిటో నీకు తెలుసట్రా? ఈ జన్మజన్మంతా కష్టపడినా అట్లాంటిది దొరకదురా.... జంతువా : అంతగా ఒళ్ళుతెలీకుండా పోయిందిట్రా? తిండి ఎక్కువయి కండ బలిసిందిట్రా? వుండు : వుండొరేయ్ వుండు– నీ కొవ్వంతా కరిగిస్తా..." నంటూ ఆ గదికున్న నాలుగు గోడలలో ఒకదాని మీద అలంకారంగా వున్న రెండు కొరడాలలో ఒకదానిని తీసుకుని కొండయ్యని ఛెడామడా బాదసాగారు.

జరిగిన దేమిటి, జరుగుతున్నదేమిటి – అని కొండయ్య ఏమీ బోధపడక ఒక్కక్షణం మానులా నిలబడి మరుక్షణంనుండి కొరడాదెబ్బల తాళానికి అనుగుణంగా చేయసాగిన నాట్యాన్ని చూడలేక కాబోలు, టేబిలు మీద బుద్ధుడి గుణగణాలు రాసి వున్న కాగితాలు ఎగరసాగాయి.

ఆ మర్నాడుదయం –

ఎల్లమ్మ మొగుడొచ్చి – గుమ్మంలో గూర్ఖావాడికి చెప్పి కొండయ్యకోసం కబురు పెట్టగా, వాడు వెళ్ళి అమ్మగారికి చెప్పగా, ముందురాత్రి ఒళ్ళుకాలిన మధుసూదనం దగ్గర కూచున్న అమ్మగారు "ఇక్కడెవడూ కొండయ్య లేడు – ఎక్కడ చచ్చాడో తెలియదని చెప్పు–" అని చెప్పగా, తూచ తప్పకుండా ఆ మాటలనే ఘూర్ఖావాడు చెప్పగా విని,ఇదేమీ అర్థంకాక తికమక పడుతూ నిల్చున్న ఎల్లమ్మ మొగుడు – మధు మొహానికి ప్లాస్టిక్ సర్జరీ విషయమై బొంబాయికి వెళ్ళి కనుక్కోవాలని హడావిడిగా వెళ్తున్న మంత్రిగారి కారు హారను విని, త్రుళ్ళిపడి, తొలగి మళ్ళీ తన గ్రామానికి వెళ్ళిపోయిన సంగతి – తోటలో మూలగదిలో ఒళ్ళు తెలియని జ్వరంతో పడి, మూల్గుతున్న కొండయ్యకు తెలియదు.

రెండురోజుల తర్వాత – కొండయ్యకు జ్వరం విపరీతంగా హెచ్చిపోయి వాడు

ప్రేలాపన మొదలెట్టాక, వాడివిషయం మంత్రిగారికి చెప్పబోతే, ఆయన కస్సుమని మండిపడితే భయపడి వెనక్కు వచ్చిన తోటమాలి వంటవాడిసాయంతో కొండయ్యను గుర్రబ్బండిలో పడేసి,కార్పొరేషను వారి ఆసుపత్రిలో చేర్చడం కానీ, చేర్చిన మూడవ నాడు కొండయ్య చచ్చిపోయిన విషయంగానీ – వాడు చచ్చిన నాల్గవనాటికి గాని వెంకమ్మకు తెలియనే తెలియదు.

కొండయ్యచచ్చిన ఎనిమిది నెలల తర్వాత ఒక సాయంకాలం కరణంగారింటికివెళ్ళి పనిముగించి, చెరువు కట్ట దగ్గరకు వెళ్ళి, ఇంత చింతచిగురు అదీ కోసుకుని ఇంటికొస్తుండగా, శాన్నాళ్ళుగా దాన్ని కోరి కోరి తపించిన కరణం గారబ్బాయి, అక్కడి కక్కడ వెంకమ్మను, ఆశ్చర్యపడిన వెంకమ్మను, అదిరిపడిన వెంకమ్మను , అరుస్తున్న వెంకమ్మను, అనుభవించి అనుభవించి ఆఖరికి, ఇది బతికివుంటే తన ప్రతిష్ట బతకదని తెలిసి దాని గొంతుక్కోసిన విషయం అమ్మ ఎంత సేపటికీ రాదేం, రాదేమని ఆ రాత్రంతా ఎదురుచూసిన కిష్టిగాడికి ఈనాటికీ తెలియదు: తెలియనే తెలియదు

పోలీసువాళ్ళు వెంకమ్మ చావుని కూపీ తీయడానికి ఆరంభించగానే కరణంగారు జరుగురుగా పట్నమెళ్ళి కరుణాకరరావుగారిని కలుసుకోగానే, వారు రాబోయే ఎన్నికలలో తమకు రావలసిన రెండువేల చిల్లర ఓట్లను వదులుకునేంత వెర్రి ముండాకొడుకు కానందున, ఫోనుఎత్తి ఒక్కమాట చెప్పగానే డ్రాప్ అయిన నాగవరం ఖూనీకేసు ఏమయిందో నాగవరం వాసులెవ్వరికీ నేటికీ తెలియదు సార్, తెలియదు...

ఏడాది తర్వాత అ.భా.అ. మహిళామండలి వారు సాంఘిక సంక్షేమ మంత్రిగారి ధర్మమా అని ప్రభుత్వం వారిచ్చిన లక్ష రూపాయల గ్రాంటుతో నిర్మించి,ఒకానొక శుభముహూర్తాన అట్టహాసంగా తెరిచిన 'కరుణాలతాశరణాలయం'లో అనాధులుగా చేరిన బాలబాలికలలో – ఆకలి చేత చిక్కినవాడు, భయంచేత మూలగా నక్కిన వాడు, సమాజపు విషపుకోరల మధ్య ఇరుక్కున్నవాడు కిష్టిగాడన్న వాడొక్కడున్నాడని ఎవరికి తెలుసు? ఎవరికీ తెలియదు.

ఎవరికీ తెలియదు.

ఎవ్వరికీ తెలియబోదు.

ఎవ్వరికీ తెలియనవసరం లేదు.

శరణాలయాలను నింపడానికి శరణార్థులు అనగా కిష్టిగాళ్ళు దండిగా, ధారాళంగా, మస్తుగా, జాస్తిగా, ఎక్కువగా, ఇతోధికంగా కావాలిమరి....

అందుకనే, ఇటు శరణాలయాలను నిర్మించే సంఘమే అటు కిష్టిగాళ్ళనూ సృష్టించడం మానదు.

*('ప్రతిభ'–ఏప్రిల్. '68)*